క్లుప్తంగా

ఎమ్మెల్యే ప్రసన్న ఆశీర్వాదం



కోవూరు : కోవూరు సర్పంచ్ వై.విజయ కుమారుడు డాక్టర్ సతీష్ వివాహం మండల కేంద్రంలోని కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఇందులో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొని, వధూవరులను ఆశీర్వదించారు. అదే విధంగా కేవీఎస్ కల్యాణ మండపంలో పార్టీ నేత దండి సురేష్ సోదరుడి కుమారుడి వివాహంలో కూడా పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు

విడవలూరు : విడవలూరు శివారు ప్రాంతంలో శనివారం ఆటో, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురికి గాయాలైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజనేయులు ఆదివారం తెలిపారు.

వరుస దొంగతనాలతో హడల్



నిందితుడి ఆనవాళ్లు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్ పరిధిలో గల ఇస్లాంపేట, శ్రీవాణి, డాన్‌బాస్కో స్కూళ్ల పరిసర ప్రాంతాల్లో ఇటీవల జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు హడలిపోతున్నారు. అర్ధరాత్రి వేళ గుర్తు తెలియని ఓ వ్యక్తి ప్రహరీలు దూకి ఇళ్లలోకి ప్రవేశించి చోరీలకు పాల్పడుతున్నారు. సరోజనమ్మ ఇల్లు, పక్కనే ఉన్న మరో ఇంట్లోకి ప్రవేశించి వంట సామగ్రితో పాటు కుళాయిలను పగలగొట్టి పైపులను అపహరించుకెళ్లాడు. ఇంట్లో ఉన్న సీసీ కెమెరాల్లో ఆగంతకుడి ఆనవాళ్లు రికార్డయ్యాయి. చోరీలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

'స్పందన'ను సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి కమిషనర్ చెన్నుడు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం పది నుంచి నిర్వహించనున్న కార్యక్రమంలో అర్జీలను అందజేయాలని పేర్కొన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

ప్రధాని చిత్రం ఏర్పాటుకు వినతి

నెల్లూరు(బారకాసు): రేషన్ సరుకులను పంపిణీ చేసే వాహనాలపై ప్రధాని నరేంద్ర మోదీ చిత్రాన్ని ఏర్పాటు చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అశోక్‌నాయుడు కోరారు. ఈ మేరకు మినీబైపాస్ రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. నేతలు నవీన్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, సాయికృష్ణ, మదన్, సాయిరెడ్డి, అభిషేక్‌నాయుడు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

వరికుంటపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వరికుంటపాడుకు చెందిన షేక్ మీరావలి(50) నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు..ఈ నెల 2న షేక్ మీరావలి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తూ దుత్తలూరు మండలం నందిపాడు సమీపంలో ఆగిఉన్న కట్టెల ట్రాక్టర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ,కుమారుడు ఉన్నారు.

టీ దుకాణంపై దాడి

ఆత్మకూరు: మున్సిపల్ బస్టాండ్ సమీపంలో టీ దుకాణం నిర్వహిస్తున్న రాజస్థాన్‌కు చెందిన జవాన్‌సింగ్‌పై మార్కెట్‌లో పనిచేసే మస్తాన్ అనే వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. బాధితుడి వివరాల మేరకు.. ఆదివారం రాత్రి మస్తాన్ టీ దుకాణం వద్దకు వచ్చి టీ సిగిరెట్లు ఇవ్వాలని కోరాడు. అప్పటికే అతను చాలా నగదు బాకీ ఉండడంతో డబ్బులు ఇవ్వాలని జవాన్ సింగ్ కోరాడు. దీంతో మస్తాన్ దుర్భాషలాడుతూ ఇక్కడకు వచ్చి మేము టీ అడిగితే ఇవ్వవా అంటూ దుకాణంలోని వస్తువులను ధ్వంసం చేశాడు. టీ గ్లాసులను పగులగొట్టాడు. అక్కడున్న వారు మస్తాన్‌ను వారించి దూరంగా తీసుకెళ్లారు. అయినా మరోసారి దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పొదలకూరు : పంచలింగేశ్వరాలయంలో..



మనుబోలు : ధ్వజ స్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం

పొదలకూరు : పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి (శివాలయం) దేవస్థానంలో ఆదివారం కోటి సోమవారం పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రమిదలు వెలిగించారు. ఆకాశ దీపంలో నూనెపోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ప్రధానార్చకుడు ప్రసాద్ స్వామి ఏర్పాట్లను పర్యవేక్షించి పూజలు జరిపించారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామ పంచలింగేశ్వరస్వామి ఆలయం, మరుపూరు కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానాల్లో కోటి సోమవారం పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు.



పొదలకూరు : శివాలయం ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఘనంగా..

మనుబోలు : కార్తీక మాసం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం మహిళలు పెద్ద ఎత్తున మండలంలోని పలు శివాలయాల్లో దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మనుబోలు మండల కేంద్రంలో ఉదయమే మంగళ స్నానాలాచరించిన మహిళలు ఉపవాసాలు ఉండి సాయంత్రం శివాలయంలో ధ్వజ స్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కండలేరు ఒడ్డున వెలసిన సంగమేశ్వరాలయం, వీరభద్రస్వామి దేవాలయంలో కూడా భక్తులు పూజలు చేశారు. అర్చకులు ఫణీంద్ర శర్మ, సాయిశర్మ, శ్రీనివాసులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. శివాలయం వద్ద ఆమంచర్ల సుధాకర్‌రెడ్డి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



మనుబోలు : శివాలయం వద్ద అన్నదానం



మనుబోలు : బొటని వేలి గోరుపై సూక్ష్మ శివలింగం

సూక్ష్మ శివలింగం

కార్తీక మాసం సందర్భంగా మండలంలోని యాచవరం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము కొయ్యతో అతి సూక్ష్మ ఆకారంలో శివలింగాకృతిని తయారు చేశాడు. రాము ప్రతిభను భక్తులు కొనియాడారు.

జొన్నవాడలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో కోటి సోమవారం పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహన్యాస రుద్రాభిషేకాలు, నవావర్ణ పూజలు, అమ్మవారి కల్యాణం వైభవంగా జరిపించారు.

నేడు ముత్తుకూరుకు మంత్రి కాకాణి రాక

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం సాయంత్రం కృష్ణపట్నం గ్రామానికి వస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా కార్తీక మాసం సందర్భంగా స్థానిక సిద్ధేశ్వరాలయంలో ప్రత్యేక పూజల్లో మంత్రి పాల్గొంటారని వెల్లడించారు.

నేడు వవ్వేరులో ఎమ్మెల్యే ప్రసన్న పర్యటన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని వవ్వేరు గ్రామంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ టౌన్, రూరల్ అధ్యక్షులు టి.మల్లారెడ్డి, సీహెచ్ సతీష్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని పంట పొలాలకు నీటి విడుదల కార్యక్రమంలో పాల్గొంటారని తెలియజేశారు.

రెండో యూనిట్లో ఉత్పత్తి నిలిపివేత

ముత్తుకూరు : మండలంలోని నేలటూరులో ఉన్న దామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో సాంకేతిక కారణాల వల్ల రెండో యూనిట్‌లో విద్యుదుత్పత్తి నిలిపివేశారు. అయితే, ఒకటో యూనిట్లో 420 మెగావాట్లు, మూడో యూనిట్లో 590 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్టు ఇంజినీర్లు ఆదివారం వెల్లడించారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం

పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయకర్తలుగా అన్నం లక్ష్మీనారాయణ-లక్ష్మి, చదలవాడ రమేష్-మల్లేశ్వరి దంపతులు వ్యవహరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. ప్రత్యేక పూజల్లో దేవస్థానం నిర్వాహకులు వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం.శ్యాంప్రసాద్, కొమ్మి వేణుగోపాల్, దాసరి శ్రీనివాసులు, చొప్పా వెంకటేశ్వర్లు, మురళీ తదితరులు పాల్గొన్నారు.



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

దేవాలయ నిర్మాణ పనులకు దాతృత్వం

వెంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు పట్టణానికి చెందిన చాట్ల కృష్ణ తనవంతుగా రూ.10 లక్షల విలువైన పనులు చేయిస్తానని ఆదివారం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ఉపాధ్యక్షుడు కోనం చినబ్రహ్మయ్య చేతుల మీదుగా కృష్ణకు స్వామివారి ప్రసాదాలు, పటాన్ని అందజేశారు. కార్యక్రమంలో దేవరం రఘురామిరెడ్డి, ఎం.శేఖర్‌బాబు, ఎం.శ్యాంప్రసాద్, ఆకులూరు హేమంత్ పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

విడవలూరు : మండలంలోని పొన్నపూడి పెద్దపాళెం గ్రామంలో కోడి పందేలు జరుగుతున్నాయనే సమాచారంతో పోలీసులు దాడులు చేసి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. అంతేకాకుండా రెండు పందెం కోళ్లు, రూ.2 వేల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజనేయులు తెలిపారు.

24న చలో కలెక్టరేట్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చలో కలెక్టరేట్‌ను ఈ నెల 24న నిర్వహించనున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి హర్ష, శ్రీనివాసులు పేర్కొన్నారు. బాలాజీనగర్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. వీఆర్ డిగ్రీ కళాశాలను వెంటనే ప్రారంభించడంతో పాటు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. నేతలు నరేంద్ర, బాలాజీ, సంతోష్, అశ్విన్, సుమంత్, కిరణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీదారులకు ఉచిత భోజన వసతి

నెల్లూరు రూరల్: నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు ఇక నుంచి ఉచిత భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేయనున్నామని భారత్‌సేవా ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశిఖామణి, ఖాసిం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వివిధ హోటళ్ల నిర్వాహకులు తమ వంతు ప్రోత్సాహాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ వారం నుంచి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని వివరించారు.

బాబా మందిరంలో అయ్యప్పకు పూజలు

కొడవలూరు : నార్తురాజుపాళెం దిన్నెలోని ద్వారకామయి శిరిడీ సాయిబాబా మందిరంలో 'హరిహర తనయ అయ్యప్ప సేవా సమాజం' ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ సంఘ అధ్యక్షుడు డి.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బాబా ఆలయంలో ఈనెల 30వ తేదీ వరకు అయ్యప్ప స్వాములకు అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మధు, శరణం, వి.రవి తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

అభివృద్ధి పథంలో పడుగుపాడు సొసైటీ



మొక్క నాటుతున్న సొసైటీ సభ్యులు



మాట్లాడుతున్న సొసైటీ సభ్యులు

కోవూరు : జిల్లాలో పడుగుపాడు సొసైటీ అభివృద్ధి పథంలో పయనిస్తోందని డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి తిరుపాల్‌రెడ్డి తెలిపారు. కోవూరులోని శాంతినగర్లో ఉన్న పడుగుపాడు సొసైటీ ప్రాంగణంలో సహకార వారోత్సవాల సందర్భంగా ఆదివారం మొక్కలు నాటే కారక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలో ఇప్పటికే నాలుగు గోదాములను నాబార్డు సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా సొసైటీ ప్రాంగణంలో 200 టన్నుల గోదాము కూడా సిద్ధంగా ఉందని, రైతులు పండించిన పంటను గిట్టుబాటు ధర వచ్చేవరకు ఈ గోదాముల్లో నిల్వ చేసుకోవచ్చన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

సొసైటీ సేవలను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. పడుగుపాడు సొసైటీలో ప్రత్యేకంగా బ్యాంక్‌ను ఏర్పాటు చేయడమే కాకుండా, బంగారంపై రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సహకార జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహకార ఎడ్యూకేషనల్ అధికారి శ్రీనివాసులు, డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి కె.తిరుపాల్‌రెడ్డి, కోవూరు సహకార బ్యాంక్ మేనేజర్ సుధాకర్, సొసైటీ సీఈఓ గోవర్ధన్ రెడ్డి, సొసైటీ సిబ్బంది ఉన్నారు.

సాహిత్యజ్యోతి పురస్కార ప్రదానం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ ఆదివారం విజయవాడలో సాహిత్యజ్యోతి పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్ మాట్లాడారు. విజయవాడలో జరిగిన 125వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక అకాడమీ చైర్‌పర్సన్ పి.శ్రీలక్ష్మి, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాన్ని అందుకున్న సుధీర్‌కుమార్

24న మహా సుదర్శన హోమం

ముత్తుకూరు : ముత్తుకూరులోని శ్రీదేవి-భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో ఈ నెల 24వ తేదీన మహా సుదర్శన హోమం జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం వెల్లడించారు. అదే రోజున అగ్ని ప్రతిష్ట, శాంతి కల్యాణ మహోత్సవం, పవిత్రజల సంప్రోక్షణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ వేడుకల కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.



ముత్తుకూరులోని చెన్నకేశవస్వామి ఆలయం

పాలస్తీనాపై దాడులు ఆపాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను ఆపాలని ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శి హనుమంత్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని టౌన్‌హాల్లో ఆదివారం నిర్వహించిన వామపక్షాల సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. నేతలు దామా అంకయ్య, మూలం రమేష్, అరిగెల నాగేంద్రసాయి, సాగర్, లక్ష్మీరెడ్డి, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో పయనించాలి



కోవూరు : ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



వెంకటాచలం గ్రంథాలయంలో..



విడవలూరు : మాట్లాడుతున్న లైబ్రేరియన్ నిరూప



కొడవలూరులో మ్యూజికల్ చైర్ పోటీలో విద్యార్థులు

- ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

కోవూరు : దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని, వారి అడుగుజాడల్లో నేటి యువత పయనించాలని గ్రంథాలయాధికారి జె.సురేంద్రరెడ్డి తెలిపారు. కోవూరు మండల కేంద్రంలోని గ్రంథాలయంలో దివంగత ఇందిరాగాంధీ చిత్రపటానికి ఆదివారం పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచి పుస్తక పఠనాన్ని తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళా ఉపాధ్యాయునులను సన్మానించారు. అంతకుముందు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

టీచర్లకు మ్యూజికల్ చైర్ పోటీలు

వెంకటాచలం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వెంకటాచలంలో ఆదివారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినులకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ రేవతి పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో మహిళలు ముందంజ

కొడవలూరు : నేటి సమాజంలో అన్నిరంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారని రిటైర్డ్ తెలుగు పండిట్ ఎం.కామాక్షి సుందరి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. భారతదేశ మొదటి మహిళా ప్రధానిగా ఇందిరా గాంధీ దేశానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమాజంలో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తున్నందున అన్నిరంగాల్లో మహిళలు మరింత ముందుకు పోవాలని ఆకాంక్షించారు. అనంతరం తెలుగు పండిట్‌తో పాటు మాజీ సర్పంచ్ బడుగు శ్రీనివాసులును సన్మానించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ జె.సురేంద్రరెడ్డి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొడవలూరులో..

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కొడవలూరు గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు మ్యూజికల్ చైర్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. తొలుత ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం లైబ్రేరియన్ కె.రాజేశ్వరి మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న వారికి కూడా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.

మహిళల భద్రతకు దిశ

విడవలూరు : మహిళల భద్రత కోసం దిశ చట్టాన్ని, యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు లైబ్రేరియన్ నిరూప తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో దిశ చట్టం-మహిళా సాధికారతపై విద్యార్థులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మహిళా పోలీస్ శ్రీలేఖ పాల్గొని, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మహిళలు, యువతులు దిశ యాప్‌ను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ స్కూల్ అధ్యాపకులు పాల్గొన్నారు.



కొడవలూరు : యల్లాయపాళెంలో..